
సాక్షి
బాపట్ల

గురువారం । 6 । మార్చి । 2025



పోలీసుల స్వచ్ఛ భారత్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం పోలీసులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. స్టేషన్ ఆవరణలో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 526.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,023 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు



పిడుగురాళ్ల: నాగుల గుడిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి బుధవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి వారిని భక్తులు దర్శనం చేసుకున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
నరసరావుపేట	6.23	5.07
గుంటూరు	6.21	5.05
బాపట్ల	6.21	5.05

సొన చిదిమేశారు

- సొన పోరంబోకు భూమి హాంఫట్
- విలువ రూ.వంద కోట్లపైమాటే..!
- ఒక్కో ఎకరం రూ.కోటిన్నరపైనే
- దొంగ సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు
- ప్లాట్లుగా వేసి విక్రయం
- రెవెన్యూ అధికారులు, సిబ్బందికి భారీగా ముడుపులు



సర్వే నంబర్ 59లోని సొన పోరంబోకు భూములు

చీరాల: వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం గ్రామం వద్ద బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న 111 ఎకరాల ప్రభుత్వ సొన పోరంబోకు భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఈ భూములను కొందరు కబ్జా చేసి దొంగ సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేసేసుకున్నారు. ప్లాట్లుగా వేసి అమ్మేస్తున్నారు. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ పాపంలో వారికీ భాగస్వామ్యం ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ భూముల విలువ రూ.వంద కోట్లపైమాటేనని స్థానికులు చెబుతున్నారు.

అసలు ఏం జరిగిందంటే..

చల్లారెడ్డిపాలెం వద్ద బైపాస్ రోడ్డును ఆనుకుని సర్వే నంబర్ 59లో ఉన్న సొన పోరంబోకు భూమిని కొందరు తహసీల్దార్లు 1.2, 3, 4, 5, 6.7, 8, 9, 10, 11 సబ్ డివిజన్‌లగా విభజించి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారు. ఇందులో 18 ఎకరాల భూమిని 1956లో అప్పటి రెవెన్యూ అధికారులు ఏ–డబ్ల్యూ కిందకి కన్వర్షన్ చేసి కొంత మందికి పట్టాలు ఇచ్చారు. మిగిలిన 93 ఎకరాలను 1993లో 83 భిన్నాలుగా విభజించారు. అధికారులు వారి స్వలాభం కోసమే వీటిని విభజించినట్టు విమర్శలు ఉన్నాయి. సబ్‌డివిజన్ చేసిన సర్వే నంబర్లతోపాటు విస్తీర్ణానికి సబంధించిన రికార్డులను ఆ పరిధిలోని చీరాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపాల్సి ఉన్నా.. అప్పటి అధికారులు పట్టించుకోలేదు. రికార్డులు రిజిస్ట్రార్ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో కొందరు అవి తమ పూర్వీకుల భూములని చెప్పి విలేజ్ సర్వేయర్లు, వీఆర్‌ఓల వద్ద ఎన్‌ఓసీ తీసుకుని దొంగ సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు.

తవ్వేకొద్దీ రెవెన్యూ అక్రమాలు

వేటపాలెం మండల పరిధిలోని భూ అక్రమాలు ప్రస్తుత సర్వేలో తవ్వేకొద్దీ బయటపడుతున్నాయి. ఈ మండలంలో ప్రభుత్వ అసైన్డ్, సొన పోరంబోకు, డ్రెయినేజీ పోరంబోకు, కుందేరు పోరంబోకు వంటి ప్రభుత్వ భూములు వేల ఎకరాల్లో అన్యాక్రాంతమయ్యాయి. కుందేరు పోరంబోకు భూములను ఆక్రమించిన అక్రమార్కులు రొయ్యల చెరువులు సాగు చేశారు. డ్రెయినేజీ, సొన పోరంబోకు భూముల్లో సేద్యం చేసుకుంటున్నారు.

సొన పోరంబోకు భూమిలో లేఅవుట్‌లు

బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న సొన పోరంబోకు భూముల్లో అక్రమార్కులు లేఅవుట్‌లు వేసి సెంటు రూ.3 లక్షల చొప్పున విక్రయిస్తున్నారు. ఈ భూములకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ చేపడితే అక్రమాలన్నీ బయటపడతాయి.

సుప్రీం కోర్టు ఏం చెప్పిందంటే..

సొన పోరంబోకు, శ్మశానం పోరంబోకు, డ్రెయినేజీ పోరంబోకు భూములపై ప్రైవేటు వ్యక్తులకు ఎటువంటి హక్కులూ ఉండవని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఆ భూములకు రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చినా చెల్లుబాటు కావని అనేక మార్లు స్పష్టం చేసింది.

రీసర్వేలో బయటపడిన భూ బాగోతం

ప్రస్తుతం నాయినపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో రిసర్వే జరుగుతోంది. రెవెన్యూ రికార్డులో సర్వే 59లో 111 ఎకరాలు సొన పోరంబోకు భూమిగా నమోదై ఉండడంతో సర్వే సిబ్బందికి అనుమానం వచ్చి విచారణ చేపట్టారు. అయితే క్షేత్ర స్థాయిలో భూమిలో ఉన్న రైతులు తమ సొంత పట్టాభూమి అని దాని తాలూకు రిజిస్టర్ డాక్యుమెంట్‌లు చూపిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయం నుంచి పొందిన పట్టాదారు పాస్ పుస్తకాలూ చూపిస్తున్నారు. దీంతో సర్వే సిబ్బంది ఏం చేయాలో పాలుపోక అవస్థలు పడుతున్నారు.



సర్వే నంబర్ 59లో ప్రైవేటు వ్యక్తుల స్వాధీనంలో ఉన్న సొన పోరంబోకు భూమి

పూర్తిస్థాయిలో విచారణ చేపడతాం

నేను ఇటీవలే బదిలీపై వేటపాలెం తహసీల్దార్‌గా వచ్చాను. ఆ భూమిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఏ మేరకు అక్రమాలు జరిగాయో పరిశీలించి నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాను.

– పార్వతి, తహసీల్దార్, వేటపాలెం

గేట్లెత్తేశారు

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పందిళ్లపల్లె శివారు నుంచి తరలింపు
- అసైన్డ్ భూముల నుంచి తవ్వకాలు
- వాడరేవు రోడ్డు నిర్మాణంతోపాటు ఇతర అవసరాలకు ..
- ఆగని పచ్చనేత ఇసుక దందా
- పట్టించుకోని ఉన్నతాధికారులు



పందిళ్లపల్లి ఎస్టీ కాలనీ సమీపంలో ఇసుక తవ్వకాలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల : చీరాల పచ్చనేత ఇసుక అక్రమ వ్యాపారం జోరందుకుంది. కూటమి సర్కారు వచ్చాక అడ్డు అదుపూ లేకుండా పోయింది. మరో వైపు బాపట్ల ఎంపీ అనుచరులు సైతం పోటీ పడడంతో ఇరువర్గాల మధ్య గొడవలు చెలరేగాయి. ఎంపీ అనుచరుల క్వారీలో ఉన్న యంత్రాన్ని చీరాల పచ్చనేత అనుచరులు తగలబెట్టారు. ఉన్నతాధికారుల జోక్యంతో ఓ ఇరవై రోజులపాటు తాత్కాలిక విరామమిచ్చిన పచ్చనేత తిరిగి అక్రమ తరలింపు మొదలు పెట్టారు. వేటపాలెం మండలం పందిళ్లపల్లె శివారు ఎస్టీ కాలనీ వద్ద ఉన్న అసైన్డ్ భూముల్లోని ఇసుక దిబ్బల నుంచి పచ్చనేత ఇసుకను తరలించి అమ్ముకుంటున్నారు. వాడరేవు–పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణానికి అమ్ముతున్నారు. చీరాల, బాపట్ల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో భవన నిర్మాణాలు, రియల్ వెంచర్లలో రోడ్లు, ప్లాట్ల చదును కోసం విక్రస్తున్నారు.

పచ్చనేత వాహనాలకు రైట్ రైట్..



చీరాల ప్రాంతంలో తాను మినహా వేరెవరూ ఇసుకను విక్రయించేందుకు వీలులేదని హుకుం జారీ చేయడంతో వేటపాలెం మండల అధికారులు పచ్చనేత ఇసుక వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. మిగిలిన వారికి ఇసుక దిబ్బలు ఉన్నా, అమ్ముకోవడానికి వీలులేదు. కాదు కూడదని తరలించే ప్రయత్నం చేసినా వేటపాలెం తహసీల్దారు, పోలీసులు ట్రాక్టర్లను సీజ్ చేస్తున్నారు. చీరాల ప్రాంతంలో పచ్చనేత ఒక్కరే అక్రమ రవాణా చేస్తుండడంతో ఇసుకకు మరింత డిమాండ్ పెరిగింది. టిప్పర్ ఇసుక రూ.20 వేల నుంచి రూ.25 వేలకు అమ్ముతున్నారు. ట్రాక్టర్ రూ. 5 వేలకు తగ్గకుండా విక్రయిస్తున్నారు. పెద్ద ఎత్తున అక్రమార్జనకు పాల్పడుతున్నారు.

జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం :

పందిళ్లపల్లె శివారు ఎస్టీ కాలనీ వద్ద ఉన్న అసైన్డ్ భూముల్లోని ఇసుక దిబ్బల నుంచే ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. దీనికి సమీపంలోనే పుల్లరిపాలెం తాగునీటి పథకం ఉంది. పుల్లరిపాలెం గ్రామపంచాయతీ పరిధిలో కొత్తరెడ్డిపాలెం, బచ్చులవారిపాలెం, ఊటుకూరిసుబ్బయ్యపాలెం, రామచంద్రాపురంతో పాటు ఎస్టీ కాలనీలు ఉన్నాయి. ఈ గ్రామాలన్నింటికీ ఇక్కడున్న తాగునీటి పథకం నుంచే మంచి నీరు అందుతుంది. ఇసుక అక్రమ తవ్వకాలతో తాగునీరు కూడా అందక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని, చర్యలు తీసుకోవాలని ఎస్టీ కాలనీ వాసులు గత ఏడాది అక్టోబర్‌లో జాతీయ ఎస్టీ కమిషన్‌కు రెండు మార్లు ఫిర్యాదులు చేశారు. అంతకుముందు జిల్లా ఉన్నతాధికారులకు సైతం పలుమార్లు విన్నవించారు. దీనిపై విచారించి తక్షణం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు బాపట్ల జిల్లా కలెక్టర్‌కు సైతం ఎస్టీ కమిషన్ సూచించింది. మితిమీరిన ఒత్తిళ్లతోనే చీరాల పచ్చనేత అక్రమ ఇసుక వ్యాపారాన్ని అడ్డుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

న్యూస్‌రీల్

గుడారాల పండగ ఏర్పాట్ల పరిశీలన



అమరావతి : గుడారాల పండగ ఏర్పాట్లను బుధవారం ఎస్పీ పరిశీలించారు. ఆయన హోసన్నా దయాక్షేత్రం ప్రాంగణంలో పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రద్దీ నియంత్రణ, కంట్రోల్ రూం వంటి అంశాలపై నిర్వాహకులతో చర్చించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, నిర్వాహకులు అబ్రహం, జాన్‌వెస్లీ, అనీల్, సీఐ అచ్చియ్య పాల్గొన్నారు.

నేడు మద్యం దుకాణాలకు లాటరీ

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం గీత కులాలకు మద్యం దుకాణాలను కేటాయిస్తున్నట్లు ఎక్సైజ్ ఈ.ఎస్ మణికంఠ బుధవారం తెలిపారు. జిల్లాలో గీత కులాలకు కేటాయించిన 13 మద్యం దుకాణాలకు 199 మంది దరఖాస్తు చేసుకున్నార న్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు జరుగుతుందన్నారు. దరఖాస్తు దారులంతా హాజరై లాటరీలో మద్యం దుకాణం దక్కించుకొన్న వారు ప్రభుత్వం నిర్ధారించిన సొమ్ము చెల్లించాలన్నారు.

ప్రపంచబ్యాంక్ బృందం పర్యటన



తాడికొండ: రాజధాని అమరావతిలో నిపుణులతో కూడిన ప్రపంచ బ్యాంక్ బృందం బుధవారం పర్యటించింది. రాజధాని అమరావతి నిర్మాణంలో ప్రపంచ బ్యాంక్ బృందం నిర్దేశించిన కార్యక్రమాల అమలు, వాటి నిర్వహణ రూపకల్పనపై చర్చ జరిపింది. నీటి నిర్వహణ ప్రాజెక్టులు, పర్యావరణ, సామాజిక రక్షణకు రూపొందించిన కార్యకలాపాలు, ప్రొక్యూర్‌మెంట్ విషయాలపై ఏపీ సీఆర్డీయే అధికారులతో బృంద సభ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రపంచ బ్యాంక్ కో టాస్క్ టీం లీడర్ గెరాల్డ్ ఒలీవర్ తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ ప్యాట్రన్ సభ్యత్వం



బాపట్ల : ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా ప్యాట్రన్ సభ్యత్వం 24 మందికి ఇవ్వటం ఎంతో సంతోషకరమని బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. ఈ మేరకు రూ.6.02 లక్షల చెక్కును రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ నారాయణభట్టుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గ్లోరియా, రెడ్‌క్రాస్ బృందం సభ్యులు పాల్గొన్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు విస్తృతం చేయాలని సూచించారు.

పోలీసుల నుంచి తప్పించుకోబోయి వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: పోలీసుల బారి నుంచి తప్పించుకునేందుకు లాడ్జి పైనుంచి దూకి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తెలంగాణ రాష్ట్రం తుకారాంగేట్‌కు చెందిన రాములు నాయక్ గుంటూరు పరిసరాల్లో జరిగిన చోరీల్లో అనుమానితుడిగా భావిస్తున్నారు. నరసరావుపేట కోర్టుకు వాయిదాకి వచ్చినట్లు తెలుసుకున్నారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని లాడ్జికి వెళ్లాడు. గుంటూరు నుంచి వచ్చిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాత్రూంకు వెళ్లి వస్తానని చెప్పి కిటికీలో నుంచి కిందకు దిగే ప్రయత్నం చేశాడు. ప్రమాదవశాత్తు జారి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సహకార సంఘాల ద్వారా వ్యాపారాలు చేపట్టాలి

కలెక్టర్ జె.వెంకట మురళి



సహకార సంఘాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా వాణిజ్య కార్యకలాపాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సంఘాల ద్వారా గిడ్డంగుల నిర్వహణ చేపట్టాలన్నారు. అలాగే పెట్రోల్ బంకులు, ఫెర్టిలైజర్స్, జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేయాలని సూచించారు. సొసైటీల్లో రికార్డుల కంప్యూటరీకరణ పూర్తిచేయాలని చెప్పారు. అనంతరం సహకార సంఘాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి సి.హెచ్.శ్యాంసన్, వ్యవసాయ శాఖ జేడీ రామకృష్ణ, పశుసంవర్ధకశాఖ జేడీ వేణుగోపాల్, గుంటూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సీఈఓ ఫణి కుమార్, ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈఓ బిందు తదితరులు పాల్గొన్నారు.

సమర్థంగా ఆధార్‌కార్డుల నవీకరణ

ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియను జిల్లాలో సమర్థంగా చేపడుతున్నట్టు కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. ఆధార్ కార్డుల నమోదు, నవీకరణ ప్రక్రియపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. మార్గదర్శకాలను వివరించారు.

మహిళా దినోత్సవాన్ని నిర్వహిద్దాం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బాపట్ల జిల్లాలో వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. మహిళా దినోత్సవం ఏర్పాట్లపై అనుబంధ శాఖల జిల్లా అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వర్, డీఆర్డీఏ పీడీ పద్మ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, మోడల్ అధికారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జల్సాల కోసం గంజాయి విక్రయాలు

- ముగ్గురు యువకుల అరెస్టు
- 3.9 కిలోల గంజాయి స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొయిన్

చీరాల అర్బన్: వ్యసనాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను బుధవారం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎండీ మొయిన్ వివరాలను వెల్లడించారు. బాపట్ల దగ్గుమల్లివారిపాలెంకు చెందిన దొప్పలపూడి యెహోషువ, చీరాల రామ్‌నగర్ న్యూకాలనీకి చెందిన బల్లాని పవన్‌కుమార్, బాపట్ల అరవ కాలనీకి చెందిన నీరుకంటి సురేష్ గంజాయిని బాపట్ల నుంచి చీరాలకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. సమాచారం రావడంతో టూటౌన్ సీఐ, పోలీస్ సిబ్బంది చీరాల మండలం బుర్లవారిపాలెం పంచాయతీ సాయికాలనీ ఓల్డ్ బైపాస్ రోడ్డుకు, బండారు నాగేశ్వరరావు కాలనీకి మధ్య బ్రిడ్జి వద్దకు వెళ్లగా.. అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు యువకులు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. దీంతో పోలీస్ సిబ్బంది వారిని వెంబడించి పట్టుకున్నారు. మధ్యవర్తుల సమక్షంలో అదుపులోకి తీసుకుని వారిని విచారణ చేశారు. నిందితులు గంజాయిని బాపట్ల నుంచి తీసుకొచ్చి అమ్ముతున్నట్టు తేలింది. వారి వద్ద నుంచి 3.9 కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనం, రూ.2 వేలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ప్రతిభ చూపిన టూటౌన్ సీఐ బి.నాగభూషణం, ఎస్సై నాగశ్రీను, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

బండరాయి పడి కార్మికుడు మృతి



మార్టూరు: ఓ గ్రానైట్ కార్మికుడు పనిచేసే ఫ్యాక్టరీలోనే బండరాయి పడటంతో మృతి చెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి మార్టూరు సమీపంలో జరిగింది. వివరాలు.. మధ్యప్రదేశ్‌కు చెందిన సంపత్ కుమార్ యాదవ్ (25) రాజుపాలెం డొంకలోని శ్రీలక్ష్మి శ్రీనివాస గ్రానైట్ ఫ్యాక్టరీలో క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి బండరాయిని కటింగ్ చేసే మిషన్ దగ్గర నిలబడి ఉన్న సంపత్ కుమార్ యాదవ్ పై ప్రమాదవశాత్తు బండరాయి దొర్లి పడింది. స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. మిషన్ ఆపరేటర్ సత్యేంద్ర సింగ్ ఫిర్యాదు మేరకు ఎస్సై సైదా కేసు నమోదు చేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం తర్వాత బుధవారం సాయంత్రం బంధువులకు సంపత్ కుమార్ యాదవ్ మృతదేహాన్ని అప్పగించారు.

తపాలా బీమా.. కుటుంబానికి ధీమా

ఉద్యోగులు, పట్టభద్రుల కుటుంబాలకు భరోసా



వేటపాలెం: పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ) పథకం గతంలో ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తించేది. ప్రస్తుతం పట్టభద్రులకు వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం అనేక మంది ఉద్యోగులు పథకంలో చేరి లబ్ధి పొందుతున్నారు. బీటెక్, ఎంటెక్, బీఈడీ, ఎంఈడీ, బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంబీబీఎస్, బీఎస్సీ, ఎమ్మెస్సీ నర్సింగ్, బీఫార్మసీ, డిప్లమా వంటి కోర్సులతో పాటు అన్ని విభాగాల్లో యూజీ, పీజీ కోర్సులు చేసిన విద్యార్థులు ఈ పాలసీకి అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. 19 – 55 ఏళ్ల మధ్య వయస్సు గల వారు అర్హులు.

ప్రయోజనాలు ఇవీ..

- పాలసీ అంగీకరించిన తేదీ నుంచి పూర్తి జీవిత బీమా సౌకర్యం
- ప్రీమియాన్ని దేశవ్యాప్తంగా ఏ పోస్టాఫీసులోనైనా చెల్లించే వెసులుబాటు
- ఐపీపీబీ, పోస్ట్ ఇన్ఫో యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం
- ల్యాప్స్ (చెల్లని) పాలసీలను నిబంధనల ప్రకారం అధికారులను సంప్రదించి పునరుద్ధరించుకోవచ్చు.
- ఒక ఏడాది ప్రీమియం ముందే చెల్లించిన వారికి 2 శాతం రిబేటు సౌకర్యం
- ఒక్కో వ్యక్తి రూ.50 లక్షల వరకు ఎన్ని పాలసీలైనా తీసుకోవచ్చు.
- ఆదాయపు పన్ను మినహాయింపు.
- ఇతర బీమా పాలసీల కంటే ప్రీమియం తక్కువ, బోనస్ అధికంగా పొందే అవకాశం.
- పాలసీదారులు మరణిస్తే పాలసీ విలువతో పాటు అప్పటివరకు జమైన బోనస్‌ను కుటుంబ సభ్యులకు చెల్లిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



పట్టభద్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అన్ని పోస్టాఫీసుల్లో పాలసీ చేసుకోవచ్చు. వివరాలకు పోస్టల్ అధికారులను సంప్రదించాలి. స్కీం గురించి మరింత మందికి అవగాహన కల్పించి భాగస్వాములను చేసేందుకు కృషి చేస్తున్నాం.

– శ్రీనివాసరావు, పోస్టుమాస్టర్, రావూరిపేట

అనుమతితోనే బల్లకట్లు, పడవలు నడపాలి

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో లైసెన్స్‌లు, అనుమతులు ఉన్న బల్లకట్టు, లాంచీలు, పడవలను మాత్రమే నడపాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలో బల్లకట్లు, లాంచీలు, పడవలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. వాటికి అనుమతులు ఉన్నదీ, లేనిదీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీఆర్వో మురళి, సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు, అచ్చంపేట, అమరావతి, దాచేపల్లి, గురజాల, రెంటచింతల, మాచర్ల, మాచవరం తహసీల్దార్లు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేద్దాం

పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్

బాపట్ల : పర్యాటక ప్రాంతంగా బాపట్ల జిల్లాను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ దిశగా కృషి చేయాలని పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ జిల్లా కలెక్టర్‌కు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పర్యాటకశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తక్కువ సమయంలో మెరుగుపరచడానికి, జీడీపీ వృద్ధి రేటును పెంచడానికి సులువైన మార్గంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అజయ్ జైన్ తెలిపారు. చీరాలలో చేనేత చీరల తయారీ విధానం గురించి, జీడిపప్పు ప్రాసెసింగ్ గురించి, రొయ్యల ప్రాసెసింగ్ గురించి కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

జిల్లాలో ఆరుబీచ్‌లు : కలెక్టర్ జె.వెంకట మురళి

జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి మాట్లాడుతూ, బాపట్ల జిల్లాలో మొత్తం ఆరు బీచ్‌లు ఉన్నాయని తెలిపారు. చీరాల ఓడరేవు, పాడురంగాపురం, సూర్యలంక, విజయలక్ష్మీపురం, రామాపురం, పొట్టి సుబ్బయ్యపాలెం బీచ్‌లు ఉన్నాయని వివరించారు.

దివ్యోత్సవం.. నేత్రోత్సవం

- లక్ష్మీనరసింహుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- పెళ్లి కుమారుడిగా శ్రీవారు
- 13న కల్యాణ మహోత్సవం
- 14న స్వామి రథోత్సవం



పెళ్లి కుమారుడి ఉత్సవంలో స్వామి



విద్యుద్దీప కాంతులతో గుడి గాలిగోపురం

మంగళగిరి/మంగళగిరి టౌన్: మంగళాద్రిలోని శ్రీలక్ష్మీ నరసింహుని బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే శ్రీవారిని, అమ్మవార్లను పంచామృత స్నపనతో మంగళస్నానం చేయించారు. అనంతరం స్వామిని పెళ్లి కుమారుడిగా, అమ్మవార్లను పెళ్లి కుమార్తెలుగా అలంకరించారు. తర్వాత శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెళ్లికుమారుడి ఉత్సవానికి మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం వారు కైంకర్యపరులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాలను ఈఓ రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 13న స్వామి దివ్య కల్యాణం, 14న రథోత్సవం జరుగుతాయని వివరించారు.